31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

గురువారం 26 ఫిబ్రవరి 2026 పేజీలు : 8

### ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను

## సందర్శించిన పోలీస్ కమిషనర్



**చురకలు క్రైమ్ ప్రతినిధి,కరీంనగర్, ఫిబ్రవరి 25 :** రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో, కరీంనగర్ నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల నిఘాను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద ఒక నిరంతర నిఘా ఉంచేందుకు 'స్టాటిక్ ఫోర్స్'ను కేటాయించామని,

-2లో

### ధర్మపురి భవిష్యత్తుకు

# బలమైన పునాది



**-సంకల్ప సభగా మారిన పాలకవర్గ పదవీ స్వీకారం**



**ధర్మపురి, చురకలు న్యూస్ :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో మున్సిపల్ ఎన్నికల అనంతరం కొత్త పాలకవర్గం పదవీ బాధ్యతలు స్వీకరించిన కార్యక్రమం ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబించిన ఘట్టంగా నిలిచింది. ఇది కేవలం అధికార బదిలీ కార్యక్రమం మాత్రమే కాదు; ప్రజల తీర్పుకు రాజకీయ, పరిపాలనా ప్రతిస్పందనగా రూపుదిద్దుకున్న ఆత్మీయ సభ. ఎన్నికల ద్వారా వ్యక్తమైన ప్రజాభిప్రాయం అధికార రూపం దాల్చిన క్షణం ఎల్లప్పుడూ చారిత్రకమే. అలాంటి చారిత్రక వాతావరణంలో ధర్మపురి పట్టణ ప్రజలు కొత్త ఆశలతో, కొత్త ఆశయాలతో కొత్త పాలక వర్గాన్ని ఆహ్వానించారు. పట్టణ ప్రజల ఆకాంక్షలు, రాజకీయ నాయకత్వ సంకల్పం, పరిపాలనా యంత్రాంగం సమన్వయం---కలిసి ఒక సరికొత్త ఆరంభానికి నాంది పలికాయి. సభ ప్రాంగణం నిండా కనిపించిన ఉత్సాహం, ప్రజల స్పందన, నాయకత్వపు హామీలు---కలిసి ధర్మపురి భవిష్యత్తుపై నూతన ఆశావాదాన్ని నిర్మించాయి. చైర్‌పర్సన్‌గా వేముల నాగలక్ష్మి, వైస్ చైర్మన్‌గా రామయ్య, 15 వార్డుల్లో విజయం సాధించిన కౌన్సిలర్లు బాధ్యతలు స్వీకరించగా సభలో హర్షధ్వానాలు మార్మోగాయి. ఇది వ్యక్తుల గెలుపు మాత్రమే కాదు; ప్రజల విశ్వాసానికి ప్రతీక. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ఫలితాలు ఒక దశ మాత్రమే; వాటి అనంతరం జరిగే బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ప్రజా నిబద్ధతకు ప్రమాణం. ఈ వేదికపై అధికార యంత్రాంగం, రాజకీయ నాయకత్వం, ప్రజా ప్రతినిధులు ఒకే దిశగా అభివృద్ధి సంకల్పాన్ని వ్యక్తం చేయడం ప్రత్యేకత. సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గాన్ని అభినందించడం ఈ కార్యక్రమానికి మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రాజాగౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్, మార్కెట్ చైర్‌పర్సన్ లావణ్య, దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్ తదితరులు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. పరిపాలన, రాజకీయాలు, సామాజిక రంగ ప్రతినిధులు ఒకే వేదికపై చేరడం సమగ్ర పాలనకు సంకేతంగా భావించవచ్చు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రసంగం ఈ సభకు భావోద్వేగ గాఢతను, రాజకీయ స్పష్టతను అందించింది. 2023లో ఎమ్మెల్యేగా ఎన్నికై అనంతరం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తాను ధర్మపురి ప్రజల ఆశీస్సులతోనే ఈ స్థాయికి చేరుకున్నానని గుర్తుచేసుకుంటూ ఆయన కృతజ్ఞతాభావం వ్యక్తం చేశారు. ప్రజల ఆశీర్వాదం లేకుండా రాజకీయ ప్రయాణం సాధ్యం

-2లో

## విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

**జగిత్యాల కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 25 :** విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభం కాగా జగిత్యాల పట్టణంలోని ఎస్.కె.ఎన్.ఆర్ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో నిర్వహణ విధానం, ప్రశ్నపత్రాల భద్రత, హాల్ టికెట్ల పరిశీలన ప్రక్రియలను ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. పరీక్షా గదుల్లో వెలుతురు, తాగునీరు, శౌచాలయాల నిర్వహణ సక్రమంగా ఉన్నాయా అనే విషయాలను పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్ర పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు విషయాన్ని అధికారులు పాటించాలని సూచించారు. మొబైల్ ఫోన్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ సక్రమంగా కొనసాగాలని

-2లో

### అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించిన వారిపై

## చర్యలు తీసుకోవాలి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 25 :** జగిత్యాల పట్టణంలో భారత రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని కళాచీ వాడలో అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు తొలగించగా బుధవారం విగ్రహాన్ని పునఃప్రతిష్టించి స్థానిక నాయకులతో కలసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ దేశ విదేశాల్లో భారత దేశ ఖ్యాతి విస్తరిస్తున్నదంటే దానికి కారణం అంబేద్కర్ రచించిన రాజ్యాంగమన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని దుండగులు ఎవరైతే తొలగించారో దీనిని తీవ్రంగా పరిగణించాలని, అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించడం భారతజాతిని అగౌరపరిచినట్లు అవుతుందన్నారు. ఈ విషయం కేవలం కులానికో మతానికో చెందినటువంటి అంశం కాదని యావత్ భారత జాతికి చెందిన అంశమని, ప్రతి సంవత్సరం ఇక్కడ ఏప్రిల్ 14వ తేదీ రోజున అంబేద్కర్ జయంతి ఉత్సవాన్ని ఏర్పాటు చేసుకుంటున్నామని గుర్తు చేశారు. భారత నేర శిక్షాస్మృతిలో ఇంతకంటే పెద్ద నేరం ఉండదని, సంఘటన వెనుక ఉన్న కుట్రను ఛేదించి బాధ్యులను వెంటనే కనుక్కొని వారిపైన చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

## ఇంటర్ మొదటి రోజు పరీక్ష ప్రశాంతం

**-ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన**


**-ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు /ఉర్దూ/హిందీ పరీక్షకు (97%)**

**మంది విద్యార్థులు హాజరు**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (పెద్దపల్లి), ఫిబ్రవరి-25 :** జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మొదటి రోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు,హిందీ,ఉర్దూ భాష పరీక్షలు జరిగాయని,ఈ పరీక్షకు (5419) మంది హాజరు కావాల్సి ఉండగా, (5271)మంది హాజరు కాగా,(148) మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, తొలి రోజు 97 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని, మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి కల్పన ఆ ప్రకటనలో తెలిపారు.

## వివాహానికి హాజరైన ప్రముఖులు



**చురకలు ప్రతినిధి హుజూరాబాద్ ఫిబ్రవరి 25 :** హుజూరాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త క్యాస ఉపేందర్ కుమారుడు సాయి లఖన్ - జహిత వివాహం బుధవారం హైదరాబాదులో జరిగింది. ఈ వివాహ మహోత్సవానికి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వి సతీష్ కుమార్, బిసి కమిషన్ మాజీ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు హాజరయ్యారు. హుజూరాబాద్ నుండి పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు, వ్యాపారులు వివాహ మహోత్సవానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఉపేందర్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను

## సందర్శించిన పోలీస్ కమిషనర్

**మొదటి పేజీ తరువాయి....**పరీక్ష ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడంలో పోలీసు శాఖ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు.పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇతర పోలీసు అధికారులు విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

**మొదటి పేజీ తరువాయి....**సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో పారదర్శకత, క్రమశిక్షణ పాటించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని కోరారు. పరీక్షా సిబ్బంది తమ విధులను నిబద్ధతతో, బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో ఒకే విధమైన ప్రమాణాలు పాటించాలని తెలిపారు. వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.పరీక్షలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో డిఐఈవో నారాయణ, తహసీల్దార్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురి భవిష్యత్తుకు

# బలమైన పునాది

**మొదటి పేజీ తరువాయి....**కాదని, ఆ ఆశీర్వాదానికి ప్రతిఫలం అభివృద్ధి రూపంలో ఇవ్వాలనే సంకల్పం తనదని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో 15 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని వ్యాఖ్యానిస్తూ, ఇది సంఖ్యల గెలుపు మాత్రమే కాదని, అభివృద్ధి--సంక్షేమ దిశగా ప్రజలు ఇచ్చిన ఆమోదముద్ర అని స్పష్టం చేశారు. "ఒకే పార్టీ, ఒకే జెండాను నమ్ముకున్న ప్రజల అభిమానం మరువలేనిది; ప్రజలకు మేలు చేయడంలో ఎలాంటి రాజీ ఉండదు" అనే ఆయన వ్యాఖ్య సభలో విశేష స్పందనను రేకెత్తించింది. ఎన్నికల హామీల అమలే ప్రజల రుణం తీర్చుకునే మార్గమని, పాలనలో పారదర్శకత, నిబద్ధత ప్రధానంగా ఉంటాయని హామీ ఇచ్చారు.ధర్మపురి మున్సిపాలిటీలో ప్రస్తుతం సుమారు ముప్పై కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మంత్రి వివరించారు. పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి దిశగా రహదారుల విస్తరణ, కాలువల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ పునర్నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య సదుపాయాల విస్తరణ వంటి కీలక పనులు చేపట్టినట్లు తెలిపారు. పట్టణ జీవన ప్రమాణాలు మెరుగు పడాలంటే మౌలిక వసతులు బలోపేతం కావాలని ఆయన స్పష్టం చేశారు. పనుల నాణ్యతపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని కమిషనర్, అదనపు కలెక్టర్‌కు సూచించారు. సమయ పాలనతో పనులు పూర్తి చేసి ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా చూడాలని ఆదేశించారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, బోర్లు, పైపులైన్ల మరమ్మతులు, నీటి నిల్వ ట్యాంకుల శుద్ధి వంటి అంశాలను అత్యవసరంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రజా అవసరాలపై ముందస్తు ప్రణాళికతో స్పందించే పాలననే సమర్థ పాలనగా ఆయన అభివర్ణించారు.పుష్కరాలు సమీపిస్తున్న నేపథ్యంలో ధర్మపురి ప్రాధాన్యం మరింత పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఘాట్ల నిర్మాణం, పాత ఘాట్ల మరమ్మతులు, యాత్రికుల కోసం తాత్కాలిక వసతి గృహాలు, పారిశుద్ధ్య సదుపాయాలు, త్రాగునీటి ట్యాంకర్లు, ట్రాఫిక్ నియంత్రణ, రహదారి విస్తరణ వంటి అంశాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. లక్షలాది మంది భక్తులు తరలి వచ్చే అవకాశమున్న నేపథ్యంలో వైద్య శిబిరాలు, అత్యవసర సేవలు, భద్రతా ఏర్పాట్లు పటిష్ఠంగా ఉండాలని స్పష్టం చేశారు. పుష్కరాలను కేవలం ఆధ్యాత్మిక వేడుకగా కాకుండా పట్టణాభివృద్ధికి అవకాశంగా మలుచుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు.ధర్మపురి క్షేత్రంపై తనకు ఉన్న ఆధ్యాత్మిక అనుబంధాన్ని మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ క్షేత్రం తనకు ఆత్మీయత కలిగించిన ప్రదేశమని, భవిష్యత్తులో ఇక్కడే నివసిస్తూ సేవ చేయాలనే సంకల్పం ఉన్నదని ప్రకటించారు. రాజకీయ నాయకత్వం ప్రాంతీయ అనుబంధంతో ముడిపడి ఉంటేనే ప్రజల విశ్వాసం బలపడుతుందని ఆయన వ్యాఖ్యలు సూచించాయి.అదనపు కలెక్టర్ రాజాగౌడ్ తన ప్రసంగంలో స్థానిక సంస్థల ఆర్థిక స్వావలంబనపై దృష్టి సారించారు. పట్టణ ప్రగతికి దీర్ఘకాలిక ప్రణాళిక అవసరమని, ఆదాయ వనరుల పెంపు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని పేర్కొన్నారు. పన్నుల సక్రమ వసూలు, వ్యయ నియంత్రణ, ప్రజా భాగస్వామ్యంతో ప్రణాళికల రూపకల్పన వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల బలం వారి ఆర్థిక సామర్థ్యంలోనే ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా రానున్న పుష్కరాల దృష్ట్యా పట్టణంలో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల పనులపై సమీక్ష నిర్వహించి, అవసరమైన నిధుల కోసం సమగ్ర నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులకు సూచించారు.చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి తన ప్రసంగంలో ప్రజల ఆశయాలే తమ పాలనకు దిశానిర్దేశమని పేర్కొన్నారు. ఎన్నికల హామీల అమలు, వార్డుల సమస్యల పరిష్కారం, పారదర్శకత, సమయపాలన---ఇవే తమ పాలనా మూల సూత్రాలని స్పష్టం చేశారు. వైస్ చైర్మన్ రామయ్య సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని, అన్ని వర్గాల ప్రజలతో సమన్వయం సాధిస్తామని తెలిపారు. ధర్మపురి మున్సిపల్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ కార్యక్రమం పరిపాలనా మార్పు కంటే ఎక్కువగా అభివృద్ధి సంకల్పానికి ప్రతీకగా నిలిచింది. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం, నిధుల సమీకరణ, ప్రణాళికాబద్ధ అభివృద్ధి, పుష్కరాల విజయవంత నిర్వహణ వంటి సవాళ్లు ముందున్నాయి. అయితే సభలో వ్యక్తమైన సంకల్పం, పరస్పర సహకారం, రాజకీయ--పరిపాలనా ఏకాభిప్రాయం ధర్మపురి పట్టణాన్ని అభివృద్ధి--సంక్షేమ దిశగా నడిపించే బలమైన పునాది వేసినట్లు స్పష్టమవుతోంది. ప్రజాస్వామ్య పునాదులపై నిలిచిన ఈ కొత్త ఆరంభం ధర్మపురి భవిష్యత్తును మరింత ప్రకాశవంతం చేయాలనే ఆశాభావాన్ని ప్రజల్లో నింపింది. ప్రజల తీర్పు, నాయకత్వ సంకల్పం, పరిపాలనా సమన్వయం సమగ్రమైతే స్థానిక స్వపరిపాలన సంస్థలు ప్రాంతీయ అభివృద్ధికి ఎంతగానో దోహదపడగలవని ఈ సందర్భం స్పష్టంగా చాటిచెప్పింది.

## మేయర్‌ను సన్మానించిన

## బిజెపి నాయకులు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి.:** కమాన్ పూర్ మండలం జూలపల్లి లో ఒక ప్రైవేట్ ఫంక్షన్ కు విచ్చేసిన కరీంనగర్ మేయర్ కోల గాని శ్రీనివాస్ ని కలిసి పెద్దపెల్లి బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మచ్చ గిరి రాము ఆధ్వర్యంలో వారికి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... కరీంనగర్లో చాలామంది కార్యకర్తల కష్టం వల్ల బండి సంజయ్ తెగువ వల్ల నేను మేయరు కావడం జరిగిందని, నాలాంటి సామాన్య కార్యకర్తకు ఇలాంటి పదవి ఒక బీజేపీ లోనే మాత్రమే దక్కుతుంది అని అన్నారు. అలాగే కమాన్ పూర్‌లో చాలా మహిమగల ఆది వరహాస్వామి ని త్వరలోనే దర్శించు కుంటాను అన్నారు.బిజెపి సీనియర్ నాయకులు మట్ట శంకర్, కమాన్ పూర్ బిజెపి మాజీ మండల అధ్యక్షులు జంగ పల్లి అజయ్, మల్లరపు అరుణ్, కమాన్ పూర్ మండల బిజెపి ఉపాధ్యక్షులు బర్ల సదానందం, కొమ్ము శ్రీనివాస్, గొట్టె సంపత్, బర్ల రమేష్, పాల్గొన్నారు.

## బిజెపి మైనార్టీ మోర్చా నేతల ఆధ్వర్యంలో

## మేయర్ కోలగనికి ఘన సన్మానం



**చురకలు విలేఖరి, కరీంనగర్, ఫిబ్రవరి, 25:** బిజెపి మైనార్టీ మోర్చా కరీంనగర్ నేతలు బుధవారం రోజున కరీంనగర్ మేయర్ కొలగని శ్రీనివాస్ ను ఘనంగా సన్మానించారు. ప్ర ప్రథమంగా తెలంగాణ రాష్ట్రంలో కరీంనగర్ బల్దియా ను బిజెపి కైవసం చేసుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని , మేయర్ గా , కోలగని శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ , జిల్లా అధ్యక్షుడు సమీ పర్వేజ్ ఆధ్వర్యంలో బుధవారం రోజున కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ కోలగని శ్రీనివాస్ ను వారంతా మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మైనార్టీ మోర్చా నేతలు పవిత్ర రమజాన్ మాసాన్ని పురస్కరించుకుని కరీంనగర్ నగరంలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని మేయర్ ను కోరారు.ముఖ్యంగా మస్జిద్ పరిసర ప్రాంతాలు మరియు మైనారిటీ వార్డుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ , మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎండి సమీ పరవేజ్ రాష్ట్ర నాయకులు ఎండి తాజ్,ఎండి బషీరుద్దీన్, జిల్లా నాయకులు ఎండి సమీ సిద్దిక్ షాదాబ్ , ఎండి అఫాన్ పాల్గొన్నారు.

# ధర్మపురి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

**రామ కిష్టయ్య సంగన భట్ల...**

దక్షిణ కాశీగా, నవ నారసింహ క్షేత్రాలలో ఉత్కృష్ట మైనదిగా, బ్రహ్మ విష్ణు మహేశ్వరుల త్రైమూర్త్య నిలయంగా గోదావరి తీరాన వెలసియున్న తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురి క్షేత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 27 నుండి మార్చి 11వరకు 13 రోజుల పాటు జరిగే శ్రీ లక్ష్మీ నరసింహ శ్రీ వెంకటేశ్వర స్వామి వారల వార్షిక బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవలే స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్య ప్రసాద్, ఆదేశములు, సూచనలను పాటిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అసౌకర్యం కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా ఈఓ శ్రీనివాస్ దర్శకత్వంలో, జక్కు రవీందర్ నేతృత్వం లోని ధర్మ కర్తల మార్గదర్శకత్వంలో, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షణలో బ్రహ్మోత్సవముల సందర్భముగా దేవాలయము లోపల వెలుపల, అన్ని వసతి అవసరమైన చోట్ల రంగులు /సున్నాలు వేయించడం జరిగింది. భక్తుల సౌకర్యార్థం దేవాలయము లోపల వెలుపల ప్రత్యేక క్యూలైన్స్, కౌంటర్లు ఏర్పాట్లు చేశారు. దాతల సహకారంతో దేవాలయం లోపల ఆవరణలో నీడ



కోసం రేకుల షెడ్లు, కూర్చోవడానికి వీలుగా సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయడం జరిగింది. భక్తుల సౌకర్యార్థం దేవాలయము లోపల, వెలుపల, గోదావరి నది తీరము లో తడుకలతో చలువ పందిర్లు, స్త్రీలు బట్టలు మార్చు కోవడానికి వీలుగా ప్రస్తుతము గల శాశ్వత డ్రెస్స్ చెంజింగ్ రూమ్స్‌తో పాటు ఆధనముగా తడుకలతో డ్రెస్సింగ్ రూములు కూడా ఏర్పాటు చేయడం జరుగుతున్నది. బ్రహ్మోత్సవాలు విస్తృత ప్రచారం నిమిత్తం పూర్వపు ఉమ్మడి జిల్లాలు అయిన కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలో పాటు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలకు వాల్ పొస్టర్లు, కరపత్రములు మరియు ప్రధాన రహదారులలో జాతర ఫ్లెక్సిలు, దేవాలయ మునకు, గోదావరి నదికి సూచించే సైన్ బోర్డులను, ఫ్లెక్సి బ్యానర్లు ఏర్పాటు చేసి భక్తులకు తెలియ పర్చుటకు చర్యలు గైకొనబడు తున్నవి. రెండు రాజగోపురములకు, దేవాలయ ములకు, ఆర్చిలకు అదనముగా విద్యుత్ దీపాలంకరణ, లైటింగ్ బోర్డులు, లైటింగ్ వేయించడానికి చర్యలు తీసు కుంటున్నారు. గతములో కంటే ఈ సంవత్సరము అదన ముగా పూల అలంకరణ, ప్రధాన దేవాలయములతో పాటు అనుబంధ ఆలయములకు అలంకరణ, శ్రీ మఠం స్థలంలో కళ్యాణోత్సవ వేదిక ప్రత్యేక అలంకరణ, బ్రహ్మ పుష్కరిణి, ఇతర అవసర మైన ప్రదేశములలో అలంకరణ చేయడానికి చర్యలు గైకొన బడుచున్నవి. భక్తుల సౌకర్యార్థం దేవస్థానము పక్షాన, స్వచ్ఛంద సంస్థలు మరియు దాతల సహకారంతో దేవాలయం – లోపల, వెలుపల, గోదావరినది తీరములో, ఇతర చోట్ల మంచి నీటి చలివేంద్రముల ఏర్పాటు చేయుటతో పాటు,



బ్రహ్మోత్సవముల సందర్భముగా క్షేత్రానికి విచ్చేయు భక్తులకు స్థానిక ప్రజాప్రతి నిధులు, ఆర్యవైశ్య, వర్తక సంఘం, రైస్మిల్లర్స్, దాతలు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామస్తుల సహకారంలో ఉచిత అన్నదానం చేయడానికి చర్యలు గైకొన బడుచున్నవి. భక్తుల సౌకర్యార్థం ఈ సంవత్సరం లడ్డు ప్రసాదం, అధికంగా పులిహోర ప్రసారం తయారు చేయించి భక్తులకు విక్రయిం చడానికి వీలు కల్పిస్తున్నారు. దేవస్థానం ఈఓ శ్రీనివాస్ ద్వారా స్థానిక తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, సర్కిల్ ఇన్స్ పెక్టర్ ఆఫ్ పోలీస్, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గార్లతో జాతర ఏర్పాట్లను ఎప్పటిక ప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యము వాటిల్ల కుండా తక్షణ చర్యలు గైకొనుటకు సమన్వయంతో జాతరను నిర్వి ఘ్నముగా జరుపుకొనుటకు చర్యలు గైకొనబడుతున్నవి.

# యూత్ కాంగ్రెస్ నాయకుల అరెస్టు అప్రజాస్వామికం

**-యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి వినూత్న రెడ్డి**



**చురకలు విలేకరి, జగిత్యాల, ఫిబ్రవరి 25 :**

ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ వద్ద నిరసన తెలిపిన యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చీబ్ తో పాటు మరో 8 మంది యూత్ కాంగ్రెస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి వినూత్న రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం వినూత్న రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు లేకుండా ఆంక్షలు, అరెస్టులు చేయడం విచారకరమన్నారు. యువజన కాంగ్రెస్ నేతల అరెస్ట్ కేంద్ర ప్రభుత్వం నియంత్రత్వ ధోరణి నిదర్శనమన్నారు. జాతి ప్రయోజనాల విషయంలో ప్రధాని మోదీ వ్యవహరించిన తీరు పై యూత్ కాంగ్రెస్ పోరాట స్ఫూర్తి హర్షనీయమన్నారు. యువత, ప్రజల పక్షాన ఉంటూ ప్రజాపోరాటాల్లో భాగస్వామ్యం అవుతామని, అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ప్రధాని మోడీ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను విడనాడాలని వినూత్న రెడ్డి డిమాండ్ చేశారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి వాట్సాప్ చాట్ బాట్

**-ఎన్పీడీసియల్ ఎస్ఈ సుదర్శనం**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 25 :** విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ అత్యాధునిక సాంకేతికతను వినియోగదారుల ముంగిట్లోకి తెచ్చిందని జగిత్యాల సర్కిల్ సూపెరిండెంట్ ఇంజనీర్ బొంకూరి సుదర్శనం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వినియోగదారులు ఇకపై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, తమ మొబైల్ నుండే వాట్సాప్ చాట్ బాట్ ద్వారా ఫిర్యాదులు నమోదు చేయవచ్చని పేర్కొన్నారు.

**ఫిర్యాదు నమోదు చేసే విధానం.**

వినియోగదారులు తమ మొబైల్ నుండి 7901628348 నంబరుకు వాట్సాప్ 'హై' అని మెసేజ్ పంపాలి. వెంటనే 'హాయ్.. ఎన్పీడీ సీఎల్ కాల్ సెంటర్‌కు స్వాగతం'అనే సందేశంతో పాటు రిజిస్టర్ కంప్లయిట్, ట్రాక్ కంప్లయిట్, చాట్ విత్ ఏజెంట్ అనే ఆప్షన్లు వస్తాయి. రిజిస్టర్ కంప్లయిట్ ఎంచుకున్నాక, మీ విద్యుత్ కనెక్షన్ (యూనిక్ సర్వీస్ నంబర్) వివరాలతో లేదా వివరాలు లేకుండా కూడా ఫిర్యాదు చేయవచ్చు. సర్వీస్ నంబర్ నమోదు చేయగానే వినియోగదారుని వివరాలు కనిపిస్తాయి. వాటిని నిర్ధారించాక (ఒకే చేశా), మెనూలో సమస్య రకాన్ని ఎంచుకోవాలి. ఫిర్యాదు నమోదు కాగానే ఒక కంప్లైంట్ ఐడి జనరేట్ అవుతుంది. ఈ సమాచారం వెంటనే సంబంధిత అధికారికి నివేదించబడుతుంది. ఫిర్యాదు పరిష్కారమయ్యాక వినియోగదారునికి సందేశంతో పాటు ఐవిఆర్ఎస్ ద్వారా కాల్ వస్తుందని ఎస్ఈ వివరించారు. ఒకవేళ పరిష్కారంపై సంతృప్తి చెందక పోతే, తిరిగి ఫిర్యాదును రీ-ఓపెన్ చేసే అవకాశం లేదా ఫీడ్ బ్యాక్ ఇచ్చే సౌకర్యం కూడా కల్పించామన్నారు. వినియోగదారులు ఎన్పిడిసిఎల్ అధికారిక వెబ్ సైట్లోని వాట్సాప్ × ఐకాన్ క్లిక్ చేసి కూడా ఈ సేవలు పొందవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నంబర్ 1912 ను కూడా సంప్రదించవచ్చని ఆయన కోరారు. సాంకేతికతను అందిపుచ్చుకుని మెరుగైన సేవలు అందించడమే సంస్థ లక్ష్యమని ఎస్ఈ సుదర్శనం స్పష్టం చేశారు.

## ఎల్ఓసి అందించిన ఎమ్మెల్సీ రమణ



**చురకలు విలేకరి, జగిత్యాల ఫిబ్రవరి 25 :** జిల్లా కేంద్రమైన జగిత్యాల పట్టణానికి చెందిన దేశవేణి శంకర్ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో గుండె శస్త్రచికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరగా ఆయన పరిస్థితిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్.రమణ వివరించారు. దాంతో ప్రభుత్వం నుండి రూ. 2,00,000 ఎల్ ఓ సి మంజూరు చేయించి వారి కుమారుడికి బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా పేషంటు బంధువులు రాష్ట్ర ప్రభుత్వానికి, మంజూరు చేయించిన ఎమ్మెల్సీ ఎల్ రమణకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్నారై సాయంతో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభం



**చురకలు విలేకరి, బీర్‌పూర్, ఫిబ్రవరి 25 :** అనారోగ్యంతో భర్త మరణించగా, ముగ్గురు కూతుళ్ళతో కలిసి పూరి గుడిసెలో నివాసం ఉంటున్న బీరప్పూర్ మండల కేంద్రంలోని నాయకపు గూడెంకు చెందిన సీపెల్లి జమున కుటుంబానికి ఇంటి నిర్మాణం కోసం ఓ ప్రవాస భారతీయుడు అందించడానికి ముందుకు రాగా నూతన గృహ నిర్మాణం కోసం ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ స్థానికులతో కలిసి బుధవారం నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆస్ట్రేలియాలో ఉంటున్న జగిత్యాల కు చెందిన కోటగిరి రంజిత్ జమున కుటుంబ దీనస్థితిని తెలుసుకొని నూతన గృహం కోసం ఆర్థిక సాయం అందించడంతో నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నూతన గృహ నిర్మాణం కోసం ప్రవాస భారతీయుడైన రంజిత్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎలమట్ల హరీష్, ఉప సర్పంచ్ ఎనగంటి జితేందర్, జగిత్యాలకు చెందిన సామాజిక సేవకుడు సామ ఉమాపతి, పంచాయతీ కార్యదర్శి నరేష్, వాడు సభ్యులు ప్రసాద్ మల్లేష్, స్థానిక నాయకులు శ్రీనివాస్ సామాజిక కార్యకర్త ఆడేపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేధం పై పోరాటం



**చురకలు విలేకరి, జగిత్యాల, ఫిబ్రవరి 25 :** సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకం పై నిషేధం విధించాలని జగిత్యాల కు చెందిన న్యాయవాది నాగిరెడ్డి మధుసూదన్ రెడ్డి ఉద్యమం చేస్తున్నారు. మధుసూదన్ రెడ్డి కు 2025 మే లో క్యాన్సర్ వచ్చినట్లు నిర్ధారణ అయ్యింది. అప్పటి నుండి బసవ తారకం హాస్పిటల్ లో చికిత్స చేసుకుంటు క్యాన్సర్ గూర్చి పోరాటం చేస్తున్నారు. సింగల్ యూస్ నిషేధం గూర్చి ప్రధాన మంత్రి, తెలంగాణ ముఖ్యమంత్రి, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కు వినతి పత్రాలు సమర్పిస్తున్నారు. అదేవిధంగా ఈ వ్యాధి బారిన ఇతరులు పడకుండా చర్యలు చేపట్టాలని, పోస్ట్ కార్డు ఉద్యమం ప్రారంభం చేశారు. జగిత్యాలలోని విద్యాసంస్థలు, న్యాయవాదుల ద్వారా ఇప్పటికి పది వేల పోస్ట్ కార్డుల ద్వారా సింగల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం కోసం ఉద్యమం చేస్తున్నారు.

# డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు పెంచాలి

**-జర్నలిస్టు సంఘాల డిమాండ్**
**-గన్ పార్కు నుంచి మీడియా అకాడమీకి ర్యాలీ**
**-అకాడమీ ఎదుట బైఠాయించిన డెస్క్ జర్నలిస్టులు**




**హైదరాబాద్, ఫిబ్రవరి,24 :** డెస్క్ జర్నలిస్టుల అక్రిడిటేషన్లు కార్డులను పెంచాలని,అర్హులైన డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులివ్వాలని పలు జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేశాయి. డెస్క్ జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ లోని గన్ పార్కు నుండి నాంపల్లి చాపల్ రోడ్డులోని మీడియా అకాడమీ వరకు జర్నలిస్టుల ర్యాలీ జరిగింది. అనంతరం జర్నలిస్టులు మీడియా అకాడమీ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు.కార్యక్రమం లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్),టీయూడబ్ల్యూజే-143 సంఘాల నాయకులు పాల్గొని మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మీడియా అక్రెడిటేషన్ల విషయంలో ఘోర వైఫల్యం చెందిందని, రెండేండ్లు జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేక పోయిందని విమర్శించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని పోరాడి తెచ్చుకున్న పాత్రికేయులకు స్వరాష్ట్రంలో అన్యాయం జరిగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వరాష్ట్రంలో జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేవని, జర్నలిస్టు గర్తింపు కోసం రోడ్డెక్కి ఆందోళన చేయాల్సి దుస్థితి ఏర్పడిందని అన్నారు. గత ప్రభుత్వం 23 వేల అక్రెడిటేషన్ కార్డులిస్తే...ఈ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి 44 వేల కార్డులిస్తామని ప్రకటించిందని, అనేక కఠినమైన నిబంధనలు పెట్టి కార్డుల సంఖ్యను భారీగా తగ్గించే ప్రయత్నం చేస్తుందని అన్నారు. డెస్క్ జర్నలిస్టులకు గతంలో ప్రతి జిల్లాకు ఐదుగురికి అక్రిడిటేషన్ కార్డులు వచ్చాయని, ప్రస్తుతం ఎడిషన్ సెంటర్ కు కేవలం నాలుగు కార్డులు మాత్రమే ఇస్తామని నిబంధన పెట్టడం దారుణమని అన్నారు. డెస్క్ జర్నలిస్టులు ఎడిషన్ కేంద్రాల్లోనే పని చేస్తున్నప్పటికీ, ఏ జిల్లాకు ఆ జిల్లా డెస్కులు వేర్వేరుగా ఉంటాయని, ప్రతి జిల్లాకు ఒక ఇన్చార్జితో పాటు నలుగురు సబ్ ఎడిటర్లు పనిచేస్తుంటారని తెలిపారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేసే డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు 12 నుంచి 8కి తగ్గించారని, వారికి కూడా15 కార్డులు ఇవ్వాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు.టీయూడబ్ల్యూజే-143 కోశాధికారి యోగానంద్ మాట్లాడుతూ, అక్రెడిటేషన్ల మంజూరులో వివక్ష తగదని, జర్నలిస్టుల అక్రిడిటేషన్ల విషయంలో గందరగోళ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గతంలో మాదిరిగానే జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, లేదంటే జర్నలిస్టు సంఘాలను కలుపుకొని సచివాలయ ముట్టడితో పాటు రాష్ట్రవ్యాప్త ఆందోళనకు వెనుకాడబో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవికుమార్, కో-కన్వీనర్ బ్రహ్మం, డెస్క్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఉపేందర్, ప్రధాన కార్యదర్శి రాజారాం, నాయకులు వెంకటరమణ, ఎస్.వెంకటేష్, మహిళా జర్నలిస్టు పి. పద్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర రావుకు వినతి పత్రం సమర్పించారు.

# స్కూల్ టాటా మ్యాజిక్ వాహనం బోల్తా

**-పలువురు విద్యార్థులకు గాయాలు.. ఆస్పత్రికి తరలింపు..**
**-పోలీస్ వాహనమే ఆంబులెన్స్..**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 25 :** మల్లాపూర్ మండల నుండి నిత్యం ప్రైవేటు పాఠశాలలకు స్కూల్ బస్సులు ఆయా గ్రామాల నుండి మల్లాపూర్ వెళ్తుంటాయి. ఈ క్రమంలో వాల్గొండ గ్రామం నుండి ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన టాటా మ్యాజిక్ వాహనం 12 మంది విద్యార్థులతో మల్లాపూర్ వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు వాహనం బోల్తాపడింది. దీంతో అందులో, ప్రయాణిస్తున్న 4 గురు చిన్నారులకు తీవ్రగాయాలవగా వారిని పోలీస్ వాహనంలో హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు చిన్నారుల కుటుంబ సభ్యులు చెబుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి ప్రైవేటు స్కూల్ బస్సుల ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా గత కొన్ని రోజుల క్రితం ఆంధ్రప్రభ దిన పత్రికలో ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులపై నజారేది అనే కథనం ప్రచురితైన విషయం తెలిసిందే. అయితే విద్యాశాఖ, పోలీసు, ఆర్టిఓ అధికారుల పర్యవేక్షణ లోపంతో తరచు ప్రమాదాలు మండలంలో జరుగుతున్నప్పటికీ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం పరిస్థితి మండలంలో నెలకొంది.




# జిల్లాలో మొదటి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 25 :**
జగిత్యాల జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు 30 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించారు. జనరల్ కోర్సులకు సంబంధించి 6879, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 1029 విద్యార్థులు హాజరు కాగా 253 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొదటి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక ఎస్ కేఎన్ఆర్ ప్రభుత్వ జూని యర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును, పరీక్ష కేంద్రంలో కల్పించిన సౌకర్యాలు,విద్యార్థుల హాజరు శాతం, పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ బిఎస్ లత కోరుట్లలోని ప్రభుత్వ బాలుర మరియు బాలికల కళాశాలను,మెట్పల్లి బాలుర జూనియర్ కళాశాల,నలంద జూనియర్ కళాశాలలను సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరీక్ష కేంద్రాల్లో కల్పించిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.ఎస్కెఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక విద్యార్థి పదినిమిషాలు లేటుగా రావడం వల్ల అనుమతించలేదు.జిల్లాలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ,మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా పరీక్షల కన్వీనర్ బి.నారాయణ తెలిపారు.

## పసి పాప మృతి కారకులను చట్టరీత్యా శిక్షించాలి



**చురకలు,విలేఖరి,వెల్గటూర్,ఫిబ్రవరి 25 :** నాగర్కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో పసిపాప మృతికి కారకులైన వారిని వెంటనే అరెస్ట్ చేసి చట్టరీత్యా శిక్షించాలని జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.కారకులు ఎంతటివారైనా విడిచిపెట్టకుండా ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. సమాజం తలదించుకునే ఈ సంఘటన పట్ల విచారం వ్యక్తం చేస్తూ పసిపాప కుటుంబానికి తగిన నష్ట పరిహారం చెల్లించాలని కుమార్ డిమాండ్ చేశారు.

## క్రికెట్ టోర్నమెంట్ను ప్రారంభచిన ఎంపీడీఓ



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఫిబ్రవరి 25 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ లో ఉమ్మడి మండల క్రికెట్ టోర్న మెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొనుగోటి శ్రీనివాస రావు సహకారంతో,సర్పంచ్ బండమీది కవిత గోపిఆధ్వర్యం లో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్న మెంట్ ను మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి వెంకట ప్రసాద్ బుధవారం ప్రారంభించారు.విజేతలకు ప్రథమ,ద్వితీయ బహుమతు లను బండారి రాజేందర్ 8వేలు,5 వేల నగదు,5 వేల విలువ చేసే ట్రోఫీలు,మెమెంటోలు మెరుగు నరేష్ గౌడ్ అందజే యనున్నట్లు తెలిపారు. మొదటి మ్యాచ్ కొండాపూర్, గుల్లకోట మధ్య జరుగగా గుల్లకోట విజయం సాధించింది.ఆర్గనైజర్ గా వడకపురం రాజు వ్యవహరి స్తున్నారు.ఈ కార్యక్రమం లో బి.రామస్వామి,గుమ్ముల సతీష్, సాగవని శ్రీనివాస్, గోపతి నరేష్,బారుపటి అజయ్,మెరుగు సంజయ్, తరల్ల నవీన్, పత్తిపాక సురేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఫిబ్రవరి 25 :** జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా కోరుట్ల పట్టణంలోని నంది చౌరస్తా వద్ద ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించబడినవి. కోరుట్ల సీఐ బి సురేష్ బాబు ఆధ్వర్యంలో కోరుట్ల ఎస్సై ఎం చిరంజీవి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొని ఈ తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అలాంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్లో పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరచి, న్యాయస్థానం ద్వారా తగిన జైలు శిక్ష లేదా జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు.ప్రజల భద్రత కోసమే ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని, అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.


# చెరువులు,కుంటలు,కాలువలపై అక్రమ నిర్మాణాల దూకుడు

**- ఇరిగేషన్ పంచాయతీ శాఖల మధ్య బాధ్యతల తిప్పలు**
**- నిర్మాణాలు నిలిపివేసి చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్**
**- నీటిపారుదల శాఖ భూములని చేతులు దులుపుకుంటున్న పంచాయతీ కార్యదర్శి**



**చురకలు,విలేఖరి, ముస్తాబాద్, ఫిబ్రవరి 25 :** మండలంలో చెరువులు ,కుంటలు,కాలువలపై అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వానికి చెందిన జల వనరుల భూములను కబ్జా చేసి శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.ఈ విషయంపై సంబంధిత ఇరిగేషన్ డి.ఈ.ను వివరణ కోరగా,"హద్దులు చూపించడం మా బాధ్యత మాత్రమే.ఆ హద్దులలో ఎవరైనా నిర్మాణాలు చేపడితే అవి అక్రమాలు.వాటిని తొలగించే బాధ్యత గ్రామపంచాయతీ కార్యదర్శిదే" అని తెలిపారు.అదే అంశంపై గ్రామసభలో పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించగా ,"ఇది ఇరిగేషన్ శాఖకు సంబంధించిన విషయం"అంటూ సమాధానం ఇవ్వడంతో ప్రజలు మరింత గందరగోళానికి గురయ్యారు. ఒక శాఖ మరొక శాఖపై బాధ్యత నెట్టివేయడంతో అక్రమ నిర్మాణాలపై ఎవరిని ప్రశ్నించాలి అన్న సందిగ్ధంలో ప్రజలు ఉన్నారు.ఇదిలా ఉండగా,ఈ అక్రమ నిర్మాణాలకు గ్రామపంచాయతీ సర్పంచ్,నూతన పాలకవర్గం అండదండలు ఉన్నాయనే చర్చలు గ్రామంలో వినిపిస్తున్నాయి. అధికారుల మధ్య సమన్వయం లోపించడంతో ప్రభుత్వ భూములు క్రమంగా ఆక్రమణకు గురవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్థల పరిశీలన చేసి,ఆ నిర్మాణాలు ఎవరికి చెందినవో గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

# 40 సంవత్సరాల తర్వాత...పూర్వ విద్యార్థుల అ"పూర్వ" సమ్మేళనం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 25 :** ఎంతగానో ఎదురు చూసిన క్షణం ఆవిష్కారమైన వేళ – నాలుగు దశాబ్దాల అనంతరం సాకారమైన బాల్య మిత్రుల కల" సెక్టార్ 3 సింగరేణి స్కూల్ 8 ఇంక్ లైన్ కాలనీ పూర్వ విద్యార్థిని విద్యార్థులు ఎంతో ప్రణాళికాబద్ధంగా ఘనంగా నిర్వహించిన వారి బాల్య మిత్రుల అపూర్వ సమ్మేళనం అందరి మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా అలాగే సింగరేణి తల్లికి వారి కృతజ్ఞతాపూర్వక భావనను తెలియజేస్తూ రచింపబడిన గీతంతో అద్భుతంగా నిర్వహించుకోవడం జరిగింది. సుమారు మూడు నెలల నుంచి చాలా శ్రమించి అందరిని ఒక్కటిగా చేయడానికి ఆర్గనైజర్స్ కమిటీ రవి పోతురాజు, నారాయణ, అన్వర్,, శ్రీధర్, యాదగిరి,స్వర్ణలత రెడ్డి, పద్మ మరియు ఇంకా 15 మంది విద్యార్థులు వారి కుటుంబాలతో కలిసి అపూర్వంగా నిర్వహించుకున్న ఈ పండగ అటు ఉపాధ్యాయులు ఇటు విద్యార్థుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా వారి గురువులు గీట్ల దామోదర్ రెడ్డి , శేషారత్నం గోపాల్ రెడ్డి మరియు ప్రస్తుత హెడ్మాస్టర్ సుందర్ రావు లను ఘనంగా సత్కరించి అపూర్వ రీతిలో పాదపూజ చేసి నేటి వారి ప్రగతికి కారణమైన అలనాటి గురువులను భక్తి భావనతో పూజించి వారికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.ఎప్పుడో విడిపోయి ఇన్నాళ్లకు మళ్ళీ కలిసిన ఆ క్షణం వారందరికీ ఎంతో అపురూపమని ఒక జీవితకాల జ్ఞాపకం అని అందులో పాల్గొన్న పూర్వ విద్యార్థిని విద్యార్థులు రామలక్ష్మి, సంగీత, కుసుమ, రాజయ్య, భాస్కర్, శ్రీనివాస్,వెంకట్ రెడ్డి,సలీం, మోహన్,కోటేష్,రాయమల్లు,తిరుపతి తమ ఆనందానుభూతులను తెలియజేశారు.ఈ సందర్భంగా సింగరేణి కోయిల స్వర్ణ అనే పేరుతో పూర్వ విద్యార్థిని స్వర్ణలత రెడ్డి రచించిన సింగరేణి తల్లి గీతం అందరినీ ఎంతగానో ఆకట్టుకొని ఈ సంవత్సరం జరిగే సింగరేణి స్కూల్ ఆన్యువల్‌డే సెలబ్రేషన్స్‌లో విద్యార్థులందరికీ స్ఫూర్తి దాయకంగా ఉండేటట్లుగా ప్రదర్శనను ఏర్పాటు చేస్తామని ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుందర రావు అభినందన పూర్వకంగా తెలియజేశారు.

# ప్రారంభమైన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు

**-పరీక్షా కేంద్రం చుట్టూ 200మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయి**
**-రాచర్ల జూనియర్ కాలేజీని పరిశీలించిన తహసిల్దార్,ఎస్ఐ**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఫిబ్రవరి 25 :** ఎల్లారెడ్డిపేట మండల పరిధిలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి తేదీ 25.నుండి మార్చి18 వరకు రాచర్ల జూనియర్ కాలేజ్, ప్రభుత్వ జూనియర్ కాలేజ్ లో ఉ. 09:00 నుండి మ.12:00 వరకు పరీక్షలు నిర్వహించబడనున్నాయని తహసీల్దార్ సుజాత.ఎస్ఐ రాహూల్ రెడ్డి తెలిపారు.పరీక్షా కేంద్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయన్నారు.ఐదుగురు (5) లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపుగా చేరడం నిషేధం.విధించినట్లు తల్లి దండ్రులు,కోచింగ్ సెంటర్ ప్రతినిధులు, ఇతర అనధికారవ్యక్తులు అక్కడతిరగడం నిషేధం విధించినట్లు తెలిపారు. లౌడ్‌స్పీకర్లు, సౌండ్ సిస్టమ్‌లు లేదా శబ్దం కలిగించే పరికరాల వినియోగం నిషేధం.ఫోటోకాపీ/జిరాక్స్ షాపులు, ఇంటర్నెట్ సెంటర్లు ,మొబైల్ ద్వారా పరీక్షలకు సహాయంచేసే కార్యకలాపాలు పరీక్ష సమయాల్లో మూసివేయాలని వారు కోరారు.ఎల్లారెడ్డిపేట మండల తహసిల్దార్ సుజాత ఎస్ఐ రాహుల్ రెడ్డి కలిసి రాచర్ల జూనియర్ కాలేజ్‌కి వెళ్లి పరిశీలించారు.ప్రజలు సహకరించి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్‌శాఖకు తోడ్పడాలని కోరారు.

# నిందితులను కఠినంగా శిక్షించాలి



**చురకలు విలేకరి, ఎండపల్లి, ఫిబ్రవరి 25 :** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మేరా జాతరలో జరిగిన ఘటనలో రెండు నెలల శిశువు మృతి చెందిన విషయంలో టి.ఎం.ఐ.వి రాష్ట్ర నాయకులు చుంచు మల్లేశం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కుల వివక్ష కారణంగా ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపిస్తూ బాధ్యులపై తక్షణమే హత్య కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా కఠిన చట్టాలను అమలు చేయాలని ఆయన కోరారు.

# దుబాయిలో తప్పిపోయిన నారాయణపురం గ్రామ వాసి

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట పిబ్రవరి 25 :** రాజన్న సిరిసిల్ల జిల్లా: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపురం గ్రామానికి చెందిన లింగాల శ్రీనివాస్ గౌడ్ (45)దుబాయ్‌లో తప్పిపోయినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు, వివరాల్లోకి వెళితే శ్రీనివాస్ గౌడ్ బ్రతుకుతెరువురీత్యా దుబాయ్ లోని “110 మార్కెట్ చైనా క్యాంప్ సొల్యూషన్ ఇన్వెస్టినేషన్ ఎల్.ఎల్.సి కంపెనీ”లో పెయింటర్ గా పది రోజుల క్రితం దుబాయ్ వెళ్ళినాడు.కంపెనీవారు ఏర్పోర్ట్ నుంచి తనను తీసుకువెళ్లి క్యాంపులో ఉంచినారు.అదే రోజు కుటుంబ సభ్యులకు శ్రీనివాస్ గౌడ్ ఫోన్ చేసి నన్ను కంపెనీ వాళ్లు రిసీవ్ చేసుకుని క్యాంప్లో ఉంచారని తన భార్య సునీతకు తెలిపాడు. నిన్నటి రోజున తన భార్యకు వేరే వాళ్ళ ఫోన్ నెంబర్ తో ఫోన్ చేసి నేను దుబాయిలో తప్పిపోయానని ప్రస్తుతం కంపెనీలో లేను అని నేను ఎక్కడ ఉన్నానో నాకు తెలియడం లేదని తెలిపాడు.అదే నంబర్కు కుటుంబ సభ్యులు మరల ఫోన్ చేయగా శ్రీనివాస్‌గౌడ్ ఫోన్ చేసుకుంటాను అంటే తనకు ఫోన్ ఇచ్చామని తప్పిపోయిన విషయం మాకు చెప్పలేదని అతను ప్రస్తుతం మా దగ్గర లేడు అని తెలిపారు.కుటుంబసభ్యులు తన భర్త ఆచూకీ కనిపెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని నాయకులను అధికారులను వేడుకుంటుంది,దుబాయ్‌లో ఇండియా ఎంబసీ వాళ్లు తన భర్త ఆచూకీ కనిపెట్టి తనను క్షేమంగా ఇండియాకు పంపించాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

# బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం వితరణ చేసిన సర్పంచ్



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట పిబ్రవరి 25 :** అనారోగ్య సమస్యతో చనిపోయిన వేముల నాగేష్ కుటుంబానికి 50కిలోల బియ్యాన్ని ఇందిరమ్మ కాలనీ గ్రామ సర్పంచ్ గడ్డం రచన చోటు వితరణ చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు.అనారోగ్యంతో కిడ్నీ సంబందించిన వ్యాధి తో వేముల నాగేష్ బాదపడుతుండగా అతని కుటుంబ సభ్యులు 6వ వార్డు సభ్యులు కొండ భరత్ దృష్టి కి తీసుకపోగా అతడు తనకు చెప్పగానే వెంటనే సర్పంచ్ స్పందించి ప్రభుత్వవిప్ వేములవాడ శాసన సభ్యులు శ్రీ ఆది శ్రీనివాస్ అన్నకు చెప్పగానే ఎల్‌ఓసి మంజూరు చేయించడం జరిగింది.ఆపరేషన్ అయిన తర్వాత కొద్ది రోజులకు అనారోగ్య సమస్యతోచనిపోయిన వేముల నాగేష్ మరణించారు.దీంతో ఆ కుటుంబానికి 50 కిలోల బియ్యం వితరణ చేయించానని సర్పంచ్ గడ్డం రచన చోటు తెలిపారు.ప్రజా ప్రభుత్వ పెద్దలైన ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కెకె మహేందర్ రెడ్డిలతో నాగేష్ కూతురు స్నేహ చదువులకు అండగా ఉంటామని సర్పంచ్ చెప్పారు.గ్రామ పంచాయతీ పరిధిలో కెసిఆర్ నగర్ 6వ వార్డులో వేముల నాగేష్ దినకర్మ బుధవారం ఉండగా వారి కుటుంబానికి గ్రామ సర్పంచ్ గడ్డం రచన చోటు 50కిలోల బియ్యం వితరణ చేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండ శ్రీకాంత్, స్థానిక వార్డు సభ్యులు కొండ భరత్, కుసుమ హేమంత్,గాజుల రాంప్రసాద్, ఖాజా, మల్లిఖార్జున, రమేష్, సతీష్, అంబటి లావణ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో ఖాదీ గ్రామోద్యగ భండార్ కొనుగోళ్లు ప్రారంభం



**చురకలు విలేకరి, జగిత్యాల, ఫిబ్రవరి 25 :** జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తా, గాయత్రీ బ్యాంకు దగ్గర బుధవారం మెట్ పెల్లి ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టాన్ ఖాదీ గ్రామోద్యగ భండార్ కొనుగోలును ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, జడ్పీ మాజీ చైర్పర్సన్ దావ వసంత సురేశ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, భండార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రాణాన్ని కాపాడే రక్షణ ఆయుధం హెల్మెట్

**-డీసీపీ బి.రామ్ రెడ్డి**
**-అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా హెల్మెట్,సీట్ బెల్ట్ ఉపయోగాలపై అవగాహన**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 25 :** అరైవ్-అలైవ్ రెండో విడత కార్యక్రమంలో భాగంగా బుధ వారం సుల్తానాబాద్‌పట్టణంలో హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ఉపయోగాలపై అవగాహన కల్పించారు.అనంతరం హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించిన వాహనదారులకు పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి,ఏసీపీ జి. కృష్ణ కలిసి గులాబీ పువ్వులు అందించి అభినందించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ప్రతి మోటార్ సైకిల్ వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.హెల్మెట్ ధరించని వారిపై తరచుగా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు.రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడం వల్ల అనేక మంది ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు.ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని,త్రిబుల్ రైడింగ్ మరియు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయవద్దని సూచించారు.హెల్మెట్‌ను బరువుగా కాకుండా బాధ్యతగా భావించాలని చెప్పారు.హెల్మెట్ మా శాసనం కాదు,మీ సంక్షేమం కోసం అని తెలిపారు.హెల్మెట్ ఒక వస్తువు కాదు,ప్రాణాన్ని కాపాడే రక్షణ ఆయుధమని పేర్కొన్నారు.రోడ్ చిన్నదైనా పెద్దదైనా ప్రమాదం ఎప్పుడైనా,ఎక్కడైనా సంభవించవచ్చని, అందువల్ల ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి,ఎస్ఈ చంద్ర కుమార్ ,సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల రక్షణకే షీ టీమ్‌లు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (పెద్దపల్లి )ఫిబ్రవరి 25 :** మహిళల రక్షణకే షీటీంలో పనిచేస్తున్నాయని చీటీ ఇంచార్జ్ స్నేహలత అన్నారు.బుధ వారం రామగుండం సి.పి ఆదేశాల మేరకు,షీ టీమ్ ఇంచార్జి ఎస్సై లావణ్య ఆధ్వర్యంలో పెద్దపెల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో వార్డు సభ్యుల కి జరుగుతున్న ట్రైనింగ్ లో షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది.అందులో భాగంగా షీ టీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్, సైబర్ క్రైమ్స్‌పై అవగాహనా కల్పించారు . ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని మరియు తల్లిదండ్రులు పిల్లలతో ఎలా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్ మరియు , కాపులపల్లి పంచాయతీ సెక్రటరీ అంజత్ పాషా బ్రాహ్మణపల్లి సర్పంచ్ రోజా రాణి గారు తూరకాల మద్దికుంట పంచాయతీ సెక్రటరీ ప్రశాంత్ మరియు వర్డ్ మెంబెర్స్ పాల్గొన్నారు.

# ఒకవైపు పాత్రికేయం ఊపిరిగా..మరోవైపు ప్రజా ప్రతినిధులుగా..

**-హుజురాబాద్‌లో పాత్రికేయుల "ద్విపాత్రాభినయం"**
**-ప్రజాప్రతినిధులుగా గెలిచిన పాత్రికేయులకు సన్మానం**



**(కోరెం సుధాకర్ రెడ్డి చురకలు ప్రతినిధి హుజురాబాద్)**

ఒకవైపు పాత్రికేయులుగా పని చేస్తూ ప్రజా సమస్యలను వెలికితీస్తూ.. మరోవైపు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన పలువురికి హుజురాబాద్ మున్సిపాలిటీ లో మంగళవారం ఘనంగా సన్మానం జరిగింది. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాగిత రాములు, ప్రధాన కార్యదర్శి కామణి రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ రొంటాల సుహాసిని హాజరయ్యారు.మండలంలోని రాజపల్లి గ్రామానికి ఇటీవల సర్పంచ్‌గా కట్కూరి మల్లారెడ్డి ఎన్నికయ్యారు.మల్లారెడ్డి గతంలో ఇంజనీరింగ్ విద్యా విభాగంలో డిప్యూటీ ఈఈగా పని చేశారు. అలాగే గత 35 ఏళ్లుగా పాత్రికేయునిగా కూడా పనిచేస్తున్నారు.హుజురాబాద్‌కు చెందిన కేసిరెడ్డి లావణ్య నాలుగోసారి కౌన్సిలర్ గా ఎన్నికై రికార్డు సృష్టించారు. హుజురాబాద్‌లో వరుసగా నాలుగో పర్యాయం గెలవడం చాలా అరుదు. ఒకసారి రెండుసార్లు గెలిస్తేనే వాళ్లపై వ్యతిరేకత ఉంటుంది అలాంటిది నాలుగోసారి ఆమె గెలిచారు.ఆమె విజయం వెనుక ఆమె భర్త పాత్రికేయుడు కేసిరెడ్డి నరసింహారెడ్డి కృషి ఉంది.ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో ఆయన కీలక భూమిక పోషిస్తారు.నరసింహారెడ్డి కూడా గత 35 ఏళ్లుగా హుజురాబాద్లో పాత్రికేయునిగా పనిచేస్తున్నారు. హుజురాబాద్ లో పాత్రికేయునిగా పనిచేస్తున్న గోస్కుల రాజకుమార్ ఇండిపెండెంట్‌గా పోటీ చేసి కౌన్సిలర్‌గా విజయం సాధించారు .మరో పాత్రికేయుడు వేల్పుల సునీల్ చెల్పూరు లో వార్డు సభ్యునిగా గెలుపొందారు. వీరందరిని ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని సన్మానించారు.ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ.. సమాజానికి పాత్రికేయులు, ప్రజా ప్రతినిధులు రెండు కళ్ళ వంటి వారిని అన్నారు. పాత్రికేయులు తమ కలం ద్వారా సమస్యలను వెలికితీస్తూ వాటిని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావడం లో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. పాత్రికేయులు వారి కుటుంబాలకు చెందిన వారు ప్రజాప్రతినిధులుగా ఎన్నిక రావడం ఆనందంగా ఉందని అన్నారు. గతంలోనూ ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా ఉన్న కాయితరాములు లసుమన్నపల్లి సర్పంచిగా పనిచేశారని గుర్తు చేశారు.జర్నలిజం నుండి వచ్చిన వారు గతంలో ఎమ్మెల్యేలుగా ఎంపీలు గా కూడా పని చేశారని, జర్నలిజం నుండి వచ్చిన క్రాంతి గతంలో ఎమ్మెల్యే అయ్యారని, సత్యనారాయణ ఎమ్మెల్సీ అయ్యారని, కే కేశవరావు రాజ్యసభ ఎంపీ అయ్యారని గుర్తు చేశారు. పాత్రికేయులే ప్రజాప్రతినిధులు అయితే వారికుండే అవగాహన ఎక్కువగా ఉంటుందని, ప్రభుత్వం, అధికారుల, పరిపాలన గురించి వారికి లోతైన అవగాహన ఉంటుందని సుహాసిని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య జర్నలిస్టులు వారధిగా పనిచేస్తున్నారని, ఫోర్త్ ఎస్టేట్ గా, ప్రజాస్వామ్యానికి నాలుగు స్తంభం మాదిరిగా జర్నలిజం ఉందన్నారు. సమాజంలో మార్పు తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని గుర్తు చేశారు.ఈ సందర్భం గా మున్సిపల్ చైర్మన్ సుహాసిని, కమిషనర్ లను ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు తిరునగరి ఆంజనేయ స్వామి, భరణి, సత్యరాజ్, టీవీ9 శ్రీధర్, పిల్లల సతీష్, పరాంకుశం కిరణ్ కుమార్, మాచర్ల రాజు, సమ్మెట సతీష్, పబ్బ తిరుపతి, టేకుల సాగర్, గోపగాని మహేష్, కేశ బోయిన స్వామి, ఎడ్ల కుమార్, ఫహీం భాయ్, నిమ్మటూరి సాయికృష్ణ,మూషికే శ్రీనివాస్, పోతరాజు సంపత్, నాగవల్లి రాజు, భారత రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# జవహర్ నవోదయ విద్యాలయం నిర్మాణ భూమిని పరిశీలించిన అధికారులు



**చురకలు ప్రతినిధి కోరుట్ల ఫిబ్రవరి,25 :** జవహర్ నవోదయ విద్యాలయ నిర్మాణం కోసం కేటాయించిన భూమిని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. జవహర్ నవోదయ విద్యాలయం స్కూల్ స్థలాన్ని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత సందర్శించి భూమి వివరాలను సమీక్షించారు.ఈ సందర్భంగా కోరుట్ల ఆర్డీఓ జివాకర్ రెడ్డి,తహసీల్దార్ కృష్ణ చైతన్య,మండల సర్వేయర్ కుమార్ స్వామి కూడా పాల్గొన్నారు.అధికారులు భూమి పరిమాణం సరిహద్దులు రికార్డులు తదితర అంశాలను పరిశీలించి భవిష్యత్తులో పాఠశాల నిర్మాణానికి అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ప్రాంత ప్రజలు నవోదయ విద్యాలయం ఏర్పాటుతో స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన అధికారులు



**చురకలు ప్రతినిధి కోరుట్ల,ఫిబ్రవరి 25 :** ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను సంయుక్త కలెక్టర్ బిఎస్ లత,ఆర్డీవో జీవాకర్ రెడ్డి,కోరుట్ల తహసీల్దార్ కృష్ణ చైతన్య పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలలో విద్యార్థినీ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు,సౌకర్యాలు కల్పించామని తెలిపారు.తాగునీరు,విద్యుత్,కూర్చునే సదుపాయం,భద్రతా ఏర్పాట్లు తదితర విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని చెప్పారు.ఇంటర్మీడియట్ పరీక్షలు విద్యార్థుల జీవితంలో ఎంతో కీలకమైనవని సంవత్సరమంతా కష్టపడి చదివిన విషయాలను ఈ వార్షిక పరీక్షల్లో ప్రతిభగా చూపించాలని సూచించారు. మంచి మార్కులతో ఉత్తీర్ణులైతే భవిష్యత్తులో ఉన్నత విద్యా అవకాశాలు మంచి కెరీర్ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని, తమ తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చేలా ఉన్నత చదువులు అభ్యసించి వారికి గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు.అలాగే పరీక్ష కేంద్రాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత పాఠశాలలు, కళాశాలల నిర్వాహకులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

# అంగన్వాడి కేంద్రంలో అన్నప్రాసనం చేసిన సర్పంచ్



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట పిబ్రవరి 25 :** ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం 1లో స్థానిక సర్పంచ్ బాలరాజు నరసగౌడ్ అంగన్వాడి టీచర్ సులోచనతో కలిసి అంగన్వాడిలో ముగ్గురు విద్యార్థులకు బుధవారం అన్నప్రసానం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొడ్డు రాజు సెక్రెటరీ కృష్ణ యాదవ్ నాయకులు కొండే వెంకటరెడ్డి అంగన్వాడి ఆయా అంగన్వాడి విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

# అక్రమంగా మట్టితరలిస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా

**-క్రిందపడ్డ డ్రైవర్ ప్రథమ చికిత్స అనంతరం రాత్రి మృతి**
**-ట్రాక్టర్ యజమాని నష్ట పరిహారం చెల్లించాలని రహదారిపై శవంతో ధర్నా**
**-ధర్నా విరమింపజేసి ట్రాఫిక్ క్రమబద్దీకరించిన పోలీసులు**





**చురకలు, విలేఖరి,వెల్గటూర్, ఫిబ్రవరి 25 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్థంభంపల్లిలో మంగళవారం రాత్రి ట్రాక్టర్ ద్వారా అక్రమంగా మట్టి తరలిస్తుండగా అదుపుతప్పి బోల్తాపడడంతో డ్రైవర్ రోడ్డుపైపడి గాయాలుకాగా ప్రాథమిక చికిత్స చేయించుకొని ఇంటికి వెళ్లగా రాత్రి మృతిచెందిన సంఘటన తీవ్ర వివాదానికి దారితీసింది. నష్టపరి హారం కోసం ట్రాక్టర్ యజమానిని డిమాండ్ చేస్తూ బుధవారం రాష్ట్ర రహదారిపై డ్రైవర్ కుటుంభీకులు ధర్నాకు దిగి ఆందోళన చేపట్టగా గంధరగోళం చెలరేగింది.స్థంభంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లెకు చెందిన అవునూరి రమేష్ 32, స్థంభంపల్లికి చెందిన లవంగం రాజేష్ అనే వ్యక్తి వద్ద ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. మంగళవారం డ్రైవర్ రమేష్ ట్రాక్టర్ ద్వారా మట్టిని తరలించేందుకు వెళ్ళాడు. ట్రాక్టర్ లో మట్టి నింపుకొని వస్తుండగా గ్రామ శివారులోని స్మశాన వాటిక వద్ద అదుపుతప్పి ట్రాలీబోల్తాపడగా డ్రైవర్ రమేష్ ట్రాక్టర్ పైనుండి క్రిందపడ్డాడు. వెంటనే అతనికి ప్రథమ చికిత్స చేయించి ఇంటి వద్దకు చేర్చారు. అప్పటివరకు బాగానే ఉన్నా రాత్రి ఆయన మృతిచెందినట్లు తెలిసింది. దీనితో డ్రైవర్ కుటుంభీకులు ట్రాక్టర్ యజమానిని నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కొంతవరకు డబ్బులు చెల్లిస్థానని మీరు అడిగినంత ఇవ్వలేనని తెలుపడంతో మృతునికుటుంబం బుధవారం రాష్ట్ర రహదారి కొత్తపల్లె వద్ద పెద్దఎత్తున ధర్నాకు దిగి ఆందో ళన చేపట్టారు.దీనితో రహదారిపై వాహనాలరాకపోకలు నిలిచి పోయి తీవ్రగందరగోళంనెలకొంది.వెంటనే పోలీసులు సంఘటన స్థలం వద్దకు వెళ్లి ధర్నాను విరమింపజేసి రాకపో కలను క్రమబద్దీకరించారు. ట్రాక్టర్ యజమాని మృతుని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరించడంతో మృతుని కుటుంభీకులు శాంతించినట్లు తెలిసింది.అక్రమ మట్టి వ్యాపారం ఓ యుకుని ప్రాణం బలిగొన్న సంఘట న పలువురి హృదయాలను కలిచి వేసింది.మృత్తునికి ఇద్దరు పిల్లలు ఆయన కుటుంబం తీవ్ర దుఃఖంలో మునిగింది.అయితే ట్రాక్టర్ బోల్తాపడి తన కుమారుడు క్రిందపడగా గాయా లు కావడం వల్లనే మృతి చెందాడని మృతుడు డ్రైవర్ తల్లి ఆవునూరి శంకరమ్మ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసునమోదు చేసి ధర్యాప్తు చేస్తు న్నట్లు వెల్గటూర్ ఎస్సై పి, ఉదయ్ కుమార్ తెలిపారు.

# బిజెపి రాష్ట్ర అధ్యక్షున్ని కలిసిన జగిత్యాల నేతలు

**-భోగ శ్రావణిపై ఫిర్యాదు**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 25 :** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును జగిత్యాల బీజేపీ నేతలు బుధవారం హైదరాబాదులో కలిశారు.మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి టికెట్ల కేటాయింపులో పాల్పడిన అవకతవకలు, పార్టీ నిధులను దుర్వినియోగం తదితర విషయాలపై పలు ఆధారాలతో లిఖితపూర్వకంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు ఫిర్యాదు చేశారు.ఎంపీ ధర్మపురి అరవింద్ అండదండలతో పార్టీని తన సొంత జాగీరుగా భావిస్తూ గత నలభై సంవత్సరాలుగా ఎన్నో కష్టనష్టాలకోర్చి పార్టీని కాపాడుకుంటూ వస్తున్న సీనియర్ నాయకులను కార్యకర్తలను అవమానాలకు గురిచేస్తూ పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని వివరించారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో గెలిచే అభ్యర్థులకు టికెట్లు ఇవ్వకుండా సర్వే పేరుతో కట్టుకథలు చెప్పి తమ అనుయాయులకు టికెట్లు కేటాయిం చిందనీ వివరించారు.అయితే తాను కేటాయించిన టికెట్లు ఎవరికి కూడా డిపాజిట్ దక్కలేదని రాష్ట్ర అధ్యక్షులు దృష్టికి తీసుకెళ్లారు.అంతేకాకుండా మున్సిపల్ ఎన్నికల కోసం రాష్ట్ర పార్టీ కేటాయించిన డబ్బుల్లో కార్యకర్తలకు ఇవ్వకుండా సుమారు కోటి రూపాయల వరకు అవకతవకలకు పాల్పడిందని అన్ని విషయాలపై సమగ్ర విచారణ జరిపి భోగ శ్రావణిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధ్యక్షుని కోరారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షున్నీ పూల బొకేతో శాలువాతో సత్కరించారు.రాష్ట్ర అధ్యక్షుడుని కలిసిన వారిలో బిజెపి రాష్ట్ర నాయకుడు ముదుగంటి రవీందర్ రెడ్డి,బిజెపి రెబల్ కౌన్సిలర్లు అరవ లక్ష్మి ఏసీఎస్ రాజు,సీపెల్లి రవీందర్, సిరికొండ వరలక్ష్మి శ్రీనివాస్, సీనియర్ నాయకులు చీటీ చంద్రశేఖర రావు, చంధ సుగుణాకర్ రావు, అక్కినపల్లి రవీందర్, ఆంకర్ సుధాకర్, అల్లలా భగవంత రావు, బలేటి శ్రీనివాస్, సురేష్, కుర్మచలం సతీష్ , బిట్టు తదితరులు ఉన్నారు.

## కోరుట్లలో జిల్లా స్థాయి ఉర్దూ మీడియం

# ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమం విజయవంతం



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఫిబ్రవరి 25 :** పి ఎం ఎస్ హెచ్ ఆర్ ఐ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కోరుట్ల వేదికగా జిల్లా స్థాయి ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమం (స్కూల్ కాంప్లెక్స్ సమావేశం) ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం పాఠశాల ప్రధా నోపాధ్యాయులు,ఉపాధ్యాయుల వృత్తి పరమైన నైపుణ్యాలను మెరుగు పర చడం కావడం విశేషం.విద్యా ప్రమాణా లను పెంపొందించడం, బోధనలో నూతన పద్ధతులను అవలంబించడం విద్యార్థుల ఫలితాలను మెరుగుపరచడం వంటి అంశాలపై చర్చలు సాగాయి.ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యా యులు వి.గంగాధర్ మరియు నల్ల భూమయ్య మాట్లాడుతూ ఉర్దూ మీడియం విద్యార్థులు పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.అంతేకాకుండా వివిధ పోటీ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు .రిసోర్స్ పర్సన్ అబ్దుల్ భారీ శిక్షణా సెషన్ నిర్వహించి, బోధనా విధానాల్లో నూతన మార్పులు, విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ, ఫలితాల విశ్లేషణ వంటి అంశాలపై ఉపాధ్యాయులకు మార్గ దర్శనం అందించారు.ఈ కార్యక్రమంలో ఎండీ అబ్దుల్ రావూఫ్,లయాక్, అజర్ అక్బర్, సలీం,సి.ఆర్.పి.లు మాన్విత, పి.గంగాధర్,జ్యోతి పాల్గొన్నారు.

## నేడే "అరైవ్ అలైవ్" కార్యక్రమం



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఫిబ్రవరి 25 :** కోరుట్లలో రోడ్డు భద్రతపై అవగాహన కోరుట్ల పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ చిరంజీవి కోరుట్ల లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, జగిత్యాల జిల్లా రైస్ మిల్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మహమ్మద్ అన్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నేడు కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో "అరైవ్ అలైవ్" కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, ప్రమాదాల నివారణ చర్యలు వంటి ముఖ్య అంశాలపై సమగ్ర అవగాహన కల్పించబడుతుంది. డ్రైవర్లు నిబంధనలు పాటించడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడగలరని అధికారులు తెలిపారు.కావున కోరుట్ల లారీ ఓనర్స్, డ్రైవర్లు, వ్యాన్ ఓనర్స్, డ్రైవర్లు జిల్లా రైస్ మిల్ డ్రైవర్లు అందరూ తప్పనిసరిగా కోరుట్ల పోలీస్ స్టేషన్‌కు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## చైర్మన్, కౌన్సిలర్ రిజ్వాన్‌కు సన్మానం

**-బీడీ లీవ్స్ కాంట్రాక్టర్ ఎంఎ రవుఫ్**



**చురకలు ప్రతినిధి కోరుట్ల ఫిబ్రవరి 25 :** కోరుట్ల మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించి పీఠాన్ని దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం కోరుట్ల మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన తిరుమల గంగాధర్, 21వ వార్డ్ కౌన్సిలర్ రిజ్వాన్లను బీడీ లీవ్స్ కాంట్రాక్టర్, గౌతమ్ బీడీ అధినేత ఎంఎ రవుఫ్ తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి, మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు.ఎంఎ రవుఫ్ మాట్లాడుతూ కోరుట్ల మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన తిరుమల గంగాధర్‌కు పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పట్టణంలోని ప్రజల సమస్యలను తెలుసుకుని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు.

## అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టివేత






**చురకలు విలేఖరి,కరీంనగర్, ఫిబ్రవరి, 25 :** కరీంనగర్ రూరల్ పోలీసులు బుధవారం రోజున గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొమ్మకల్ గ్రామానికి చెందిన దుండుగోల రవి అను నతడు తన యజమాని అయిన సుద్దాల పరశురాములు ఆదేశాల మేరకు మరియు మ్యాదరవేణి రాములు అనువారు తమ ట్రాక్టర్ల నందు అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా బొమ్మకల్ గ్రామంలోని ప్లైఓవర్ బ్రిడ్జి వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు అట్టి నిందితులను అదుపులోనికి తీసుకొని అట్టి ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేయడమైనది మరియు తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపనైనది, మరియు ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సిఐ ఏ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు

**-పాల్గొన్న సీపీ గౌష్ ఆలం**



**చురకలు క్రైమ్ ప్రతినిధి, కరీంనగర్, ఫిబ్రవరి 25 :** కరీంనగర్: నగరంలోని ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యం లో బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించ బడింది. ఈ కార్యక్రమానికి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముస్లిం సోదరులతో కలిసి సీపీ ఉపవాస దీక్షను విరమించి, వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడు తూ,పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణ కు,దాతృత్వానికి మరియు మత సామరస్యానికి ప్రతీక అని కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణ లో ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీతో పాటు భీంరావు (అడిషనల్ డీసీపీ), యాదగిరిస్వామి (ఏసీపీ ట్రాఫిక్), విజయకుమార్ (ఏసీపీ రూరల్),ట్రాఫిక్ విభాగం సిబ్బంది స్థానిక ముస్లిం సోదరులు సిబ్బంది పాల్గొని,మతసామరస్యాన్ని చాటారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**-పేదింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం**

**-ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్**



**చురకలు విలేఖరి పెగడపల్లి, ఫిబ్రవరి 25 :** పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, పేదింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పెగడపల్లి ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ, వయోవృద్ధుల, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రతిపాదన మేరకు సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ద్వారా జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని పెగడపల్లి, అయితుపల్లి గ్రామాలలోని లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, బుధవారం గృహ ప్రవేశం చేశారు. పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ హాఫీజ్ హైమద్, అయితుపల్లి గ్రామానికి చెందిన జేరిపోతుల శంకరమ్మ -రాజయ్యలు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్లను స్థానిక సర్పంచులు ఒరుగల అరుణ - శ్రీనివాస్, మ్యాకల అంజమ్మ - మల్లయ్య తో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ ఇందిరమ్మ ప్రారంభించి, గృహ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచులు బత్తుల ప్రదీప్, గోలి సంజీవరెడ్డి, ఎడ్ల శ్యాంసుందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు విజయభాస్కర్, చెట్ల కిషన్, మండల నాయకులు కదారి తిరుపతి, తడగొండ రాజు, మూల రాంరెడ్డి, తడగొండ కుమార్, కేతవేణి సంజీవ్, నీరటి రాజ్ కుమార్, పుల్కం జలపతి, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

# బాలికలను చదివిద్దాం ...కాపాడుదాం...



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (ధర్మారం) ఫిబ్రవరి 25 :** మండలంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా కేంద్ర సాధికారత కోఆర్డినేటర్ దయ అరుణ "బేటీ బచావో -- బేటీ పడావో" పథకం పై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలను రక్షించడం,వారికి నాణ్యమైన విద్య అందించడం ప్రతి కుటుంబం మరియు సమాజం బాధ్యత అని పేర్కొన్నారు. గర్భంలో బాలికల హత్యలను అరికట్టడం,బాల్య వివాహాలను నిరోధించడం, అమ్మాయిల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించడం అత్యంత అవసరమని తెలిపారు. అమ్మాయిలు చదువుకుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని, మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఆమె వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామ స్థాయిలో ప్రజలకు తెలియజేయడంలో వార్డు సభ్యులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ శ్రీమతి బ్లాండినా, ఐసిడిఎస్సూపర్వైజర్ సంతోష్, అంగన్వాడీ టీచర్లు మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# సింగరేణి సంస్థ మనుగడకు ప్రతి ఒక్కరు పాటుపడాలి

**-సింగరేణి జిఎంలు**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి 25 :** సింగరేణి సంస్థ మనుగడకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి అని ఆర్జీ త్రి జి ఎం సుంకర మధుసూదన్ ఏపీ ఏజిఎం కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. బుధవారం సింగరేణి ఎస్సీ ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం ఆర్జీత్రీ వైస్ ప్రెసిడెంట్ బత్తుల శంకర్ ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించినఆర్జీ 3 జనరల్ మేనేజర్ మధుసూదన్ మరియు ఏ ఎల్ పి జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ఆవిష్కరించారు. వారికి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆర్జీ 3 తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పన్నూరు గ్రామ ఉపసర్పంచ్ కావేటిమల్లేశ్వరి ఎస్సీ ఎస్టీ నాయకులు ఓసిపి టు పిట్ పిసెక్రెటరీ బోటుకు కుమార్ ఏ ఎల్ పి ఫిట్ సెక్రటరీ శంకర్ దయాల్ శర్మ ఆర్ జి త్రీఆర్గనైజర్ సెక్రెటరీ విజయ్ కుమార్ ఆర్ జి 3 ఆర్గనైజింగ్ సెక్రటరీ పేగ శైలజ కనుకుంట్ల బానేష్ కల్లేపల్లిలక్ష్మణ్ తదితరులు ఎస్సీ ఎస్టీ నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అని అన్నారు.



# ఇంటర్ విద్యార్థులకు శుభాకాంక్షలు



**-"ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసి విజయం సాధించండి"**

**-ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్**

**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఫిబ్రవరి 25 :** ప్రారంభమవుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జీవితంలో ఎంతో కీలకమైన ఈ దశలో ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా పరీక్షలకు హాజరుకావాలని ఆయన ఆకాంక్షించారు. పరీక్షల సమయంలో ఎటువంటి మానసిక ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతమైన చిత్తంతో ప్రశ్నలకు సమాధానాలు రాయాలని సూచించారు. శ్రమకు తగ్గ ఫలితం ఖచ్చితంగా లభిస్తుంది. మీరు చేసిన కృషి తప్పకుండా మంచి ఫలితాన్ని ఇస్తుంది అని ఆయన విద్యార్థుల్లో నమ్మకాన్ని నింపారు. విద్యార్థినీ, విద్యార్థులందరూ క్రమశిక్షణతో పరీక్షలు రాసి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆశీర్వదించారు. అలాగే పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని, విద్యార్థులకు ప్రశాంత వాతావరణం కల్పించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి విద్యార్థి విజయం సాధించి తమ తల్లిదండ్రులకు, గురువులకు కోరుట్ల నియోజకవర్గానికి గర్వకారణంగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం.

# "సీట్ బెల్ట్‌తో మీ ప్రాణాలకి రక్షణ"



**-సురక్షిత ప్రయాణం.... ప్రజల భద్రతే మా పోలీస్ ప్రాధాన్యం**

**-గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి**

**చురకలుప్రతినిధి కమాన్‌పూర్ (గోదావరిఖని) ఫిబ్రవరి 25 :** రోడ్డు ప్రమాదాలను నిర్మూలించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న "ఆరివ్ అలీవ్" రెండో విడత కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు ప్రత్యేక సీట్‌బెల్ట్ తనిఖీ డ్రైవ్ నిర్వహించారు. గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ ఈ రమేష్, సిబ్బంది తో కలిసి గాంధీ చౌరస్తా, కార్ టాక్సీ అడ్డా ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీట్‌బెల్ట్ లేకుండా వాహనాలు నడుపుతున్న డ్రైవర్లను గుర్తించి, వారికి చట్టపరమైన చర్యలతో పాటు అవగాహన కల్పించారు. "సీట్ బెల్ట్ ధరించడం పోలీసుల కోసం కాదు, మీ స్వీయ భద్రత కోసం. రోడ్డు ప్రమాదాలలో సీట్‌బెల్ట్ ధరించకపోవడం వల్లే ఎక్కువ ప్రాణనష్టం జరుగుతోంది. ప్రతి ఫోర్‌వీలర్ డ్రైవర్ డ్రైవింగ్ సమయంలో తప్పనిసరిగా సీట్‌బెల్ట్ ధరించాలి. రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని, ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సీఐ సూచించారు.